


ఆమె నడచిపోతూంది. పుస్తకాలదొంతర ఎడమచేతో గుండెల కదుముకుంటూ నడుస్తూంది. మామూలుగా కాదు, హంస లాగ మత్త మదగజంలాగ త్రాచులా మెలికలు తిరుగుతూంది.

కన్నార్పకుండా ఆమెవైపే చూస్తూ నడుస్తున్నాడతను — అమ్మాయిలను చూచి వంకర్లు తిరిగిపొయ్యే చాలామంది అబ్బాయిల్లా అతనూ వంకర్లు తిరిగిపొయ్యేడు. ఆమె నడకలోని నాజూకు అతనిచేత 'వహ్వా' అనిపించింది. హుషారుగా కూనిరాగంతీస్తూ ఆమెవెనకే నడుస్తున్నాడు.

'చిట్టెమ్మా చిన్నెమ్మా చూడవమ్మా నన్ను... తీపునవ్వా కాదన్నావేడ...' ఉన్నట్టుండి కూనిరాగం కాస్త మధ్యలోనే ఆగిపోయింది. ముందుకువేసిన కుడికాలు నో అరటి తొక్కపైపడి బారెడుదూరం పోయి చటుక్కున ఆగిపోయింది. అతని తల టక్కున భూమిని ముద్దెట్టుకొని విరిచిపోయింది. చేతిలోని పుస్తకాలు చెల్లా చెదరుగా పడ్డాయి. అతనుమాత్రం నో రెండు క్షణాలు రోడ్డు కడ్డంగా ఉండిపోయాడు.

జోగారావు భారంగా కళ్ళెత్తి చూశాడు. కళ్ళు బైర్లుకమ్మి నో క్షణం ప్రపంచం పచ్చగా కన్పించింది. మరుక్షణం బాధగా మోకాలు పట్టుకొని లేచి నిల్చున్నాడు. ఎవరైనా చూస్తున్నారేమోనని వెనక్కుతిరిగి చూచి, ఎవరూ లేనందుకు సంతోషించాడు. క్రిందవున్న పుస్తకాలు తీసుకుంటూ ముందుకు చూచాడు.

ముందు నడుస్తున్న ఆ రెండుజడ లమ్మాయి అతనివైపుచూచి నవ్వుతూంది. 'తగినశాస్తి జరిగింది కదూ?' అన్నట్టుందామె నవ్వు.

అతని ఒళ్ళంతా తేళ్ళు జెర్రులు పాకినట్లైంది. హృదయం భాస్వరంలా ఒక్కసారిగా భగ్గుమంది. అవమానంతో ముఖం ముడుచుకుపోయింది.

ఛ! ఛ! ఎంత అవమానం. తనికెందుకే ఎందుకు పడాలి? ఆ అరటి తొక్క ఏ కాలిక్రిందనో పడాల్నా తన ఖర్మ కాకుంటే! అయినా తిన్నవాడెవడో ప్రక్కన వేయకూడదూ, నడిరోడ్లో వేయకపోతే! ఇడియట్! కల్చర్‌లెస్ బ్రూట్! అరటి తొక్క వేసినవాణ్ణి కసితీరా తిట్టుకుంటూ ముందుకి చూచాడు.

ఆ అమ్మాయి వెళ్ళిపోతూంది. కాలేజీ లోపలికెళ్ళి కనుమరుగైంది. కాని ఆమె ఆకారం అతని కళ్ళముందు కన్పిస్తూంది. ఆమె నవ్వు చెవుల్లో ప్రతిధ్వనిస్తూంది.

ఆనాడు స్వయంవరంలో విల్లెక్కుపెట్టలేక పడిపోయిన రావణుని చూచి సీత నవ్విన నవ్వు. మయసభలో కాలుజారిన దుర్యోధనుని అవమానపరచిన ద్రౌపది నవ్వు — ప్రస్తుతం తన్ను చూచి ఆ అమ్మాయి నవ్విన నవ్వు—

'భారత రామాయణాలలో యుద్ధాలకి

కారణం నవ్వే!' ఎక్కడో చదివిన వాక్యాలు గుర్తొచ్చా యతనికి. కాని తనేం చెయ్య గలడు. ఏమైనా ప్రతీకారం తీర్చుకోవాలి? హాం...ఎలాగో ప్రతీకారం చెయ్యాలి. ఐతే యెలా? ఆలోచిస్తూనే వెనక్కి తిరిగాడు. కాలేజీ వెళ్ళటం మానుకుని రూం వైపు నడిచాడు.

'ఏరా జోగీ! ప్రైవేట్ క్లాసని ఏడు గంటలకే వెళ్ళి ఇప్పుడే వస్తున్నావేం? కాలేజీ కెళ్ళలేదూ?' అన్నాడు గోపీ అతని వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

'ఆఁ! ఏదో ఎంగేజిమెంటు గుర్తొచ్చి తిరిగొచ్చుంటాడు.' ఇంకో ఫ్రెండు అందు కున్నాడు.

జోగారా వివేవీ పట్టించుకునే స్థితిలో లేడు. మౌనంగా వెళ్ళి వో ఈజీచైర్‌లో కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఎప్పుడూ ఏదో వెకిలిగా నవ్వుతూ గలభా చేస్తుండే వాడల్లా ఒక్కసారి మౌనవ్రతం పాటించటం చూచి అక్కడున్న వాళ్లంతా ఆశ్చర్య పోయారు. వాడిపోయిన వంకాయలా ముడుచుకుపోయిన అతని ముఖాన్ని చూస్తే గోపీకి జాలేసింది. ఏదో సమ్‌తింగ్ జరిగుంటుందన్న ఉద్దే శ్యంతో వాడి దగ్గరగా వెళ్ళి 'ఒరేయ్! ఏం జరిగిందో చెప్పరా! స్నేహితుడ్ని నాకు చెప్ప టాని కెందుకురా జంకుతావ్?' అన్నాడు గొప్ప సానుభూతి చూపుతున్న వాడిలాగ.

ఆ మాటతో పాపం జోగారావు కరిగిపోయాడు. కరిగి నీరై వో మాదిరి ఏడుపు ముఖం పెట్టి 'ఒరేయ్! నా కవ మానం జరిగిందిరా' అన్నాడు.

'ఏమిటీ? నీ కవమానమా? ఎన్ని గుండెలు. ఎవడా దురాత్ముడు? చెప్పు! వాణ్నిప్పుడే...' అన్నాడు గోపీ సినిమా డైలాగ్స్‌లా.

'వాడు' కాదురా 'ఆమె' అంటూ జరి గిందంతా తు. చ. తప్పకుండా చెప్పాడు. ప్రతీకారానికో మార్గం చెప్పమన్నాడు కూడా వాళ్ళని.

కథంతా విని వాళ్ళు గొల్లున నవ్వేసరికి జోగారావుకు ఒళ్ళు మండిపోయింది.

'ఒరేయ్! ఏమిటా వెధవల్లారా, ఎందు కలా నవ్వుతారు? ముందు నే నడి గింది చెప్పండి. ప్రతీకారం ఏం చెయ్య మంటారో చెప్పండి. ఆ తర్వాత నా తడాఖా చూపిస్తా గాని' అన్నాడు ఆవేశంగా. అత నేం మాట్లాడుతున్నాడో అతనికే తెలీటం లేదు.

'హోరేయ్ జోగీ! అయితే ఏదో ఒకటి చెయ్యాల్సిందేనంటావా?' అన్నాడు గోపీ లేచి అతనికి దగ్గరగా వెళ్తూ!

'తప్పకుండా చెయ్యాల్సిందే'

'అయితే నే చెప్పినట్లు చేస్తావా?'

'వో. యస్. త్వరగా చెప్పు' ఆతృతగా అడిగాడు.

'అయితే నువ్వా అమ్మాయిని వెంటనే ప్రేమించెయ్!' అన్నాడు గోపీ సీరియస్‌గా.

'ఏమిటీ?' తెల్లబోయాడు జోగారావు.

'అవున్రా! ప్రేమించడమంటే ఏమను కున్నావ్? ఆ అమ్మాయిని బుట్టలో వేసు కోటం అన్నమాట. నీ ప్రేమ సక్సెస్ అయిందా ఆ అమ్మాయి నీకు లొంగి పోయినట్లే. అప్పుడు పర్మనెంట్‌గా ఆమె మెళ్ళో తాళి గట్టి, లైఫ్‌లాంగ్ ఆమె జీవితాన్ని నీ చెప్పుచేతల్లో ఉంచుకోవచ్చు. దిస్ ఈజ్ ఇన్‌డైరెక్టు ప్రతీకారం. శకుని మామ చూపిన మార్గంరా యిది.'

'అయితే ఆ అమ్మాయి నన్ను ప్రేమి స్తుందంటావా?' గోపీ ముఖంలోకి చూస్తూ అనుమానంగా అడిగాడు.

'ప్రేమిస్తుందంటావా ఏమిటి, ప్రేమించి తీరుతుంది. ఎందుకంటావా, నువ్వు పడినప్పుడు నీ అవస్థ చూచి ఆమె నవ్వినా మనస్సులో జాలిపడి వుండాలి. ఒక వేళ అలా జాలి కలిగుంటే పిట్ట వలలో పడ్డట్లే! 'జాలి ప్రేమకి మొదటిమెట్టు' అన్నారందుకే. మరి అసలింతకూ ఆ అమ్మాయి ఎవర్రా?'

'ఎవరో ఏమిటి ఫస్ట్‌ఇయర్‌లో ఉండే శ్యామల. సన్నగా, ఎర్రగా ముఖానికో అంగు ళం మందం రోజ్ పౌడర్ పులుము కొస్తుందే, ఆవిడ. అందరూ 'పోర్షియా' అంటుంటారు చూడు, ఆ అమ్మాయేరా' చెప్పడం ముగించి ఉన్నట్టుండి లేచి నిల్చు న్నాడు జోగారావు. 'ఇప్పుడే వస్తా' అంటూ ఒక్క ఉదుటున బైటకు నడిచాడు.

'బ్రైయువర్‌బెస్ట్ విష్ యు గుడ్ లక్' నవ్వుతూ అన్నాడు గోపీ.

'ఒరేయ్! ఒళ్ళు జాగ్రత్తరోయ్!' యింకో ఫ్రెండు అరిచాడు.

గదికప్పు లేచిపోయేట్లు నవ్వుతున్నా రంతా. కాని జోగారావు అప్పటికే గది దాటి చాలదూరం, వాళ్ళనవ్వులు వినిపించ నంత దూరం వెళ్ళిపోయాడు.

జోగారావు ప్రతీకారానికి ప్రారంభించిన ప్రేమ, కొద్దిరోజులకు అలవాటుగా తయా రైంది. ఒక్కరోజామె కన్పించకుంటే అతని హృదయం విలవిల్లాడి పొయ్యేది. అప్పుడప్పుడతని కలలో కన్పించటం ప్రారం భించిందామె. ఇవన్నీ చూచి తను నిజంగా ఆమెను ప్రేమిస్తున్నట్లు నిశ్చయించు కున్నాడు—

అదిమొదలు జోగారావు ఆ అమ్మాయికి జీతంలేని బాడీగార్డు, ప్రమోషన్‌లేని సీ. ఐ. డి. ఆమె ఇల్లెక్కడో కనుక్కున్నాడు. ఆ అమ్మాయి తమ్ముడ్ని పరిచయం చేసుకుని, కాఫీహోటళ్ల చుట్టూ తిప్పి, రెండు సిని మాలు చూపించి కాకాపట్టాడు. అతని ద్వారా వాళ్ళింటి విషయాలన్నీ సేకరించాడు. ఆ అమ్మాయి ఎప్పుడెక్కడి కెళ్ళేది ముందు గానే తెలుసు కుంటున్నాడు. ఆవిడ సినీ ప్రోగ్రాంలు అతనికి కరతలామలకం. ఆఖరికా అమ్మాయికి ఎన్నిరంగుల్లో ఎన్నిబట్ట లున్నాయోకూడా కంఠతా పేశాడు. ఎంత చేసినా అతని శ్రమంతా వృథా అయి పోతూంది. ఒక్కసారైనా ఆమె అతనితో మాట్లాడిందిలేదు. ఎన్నోసార్లు పలకరించా లని ప్రయత్నించాడు. కాని ధైర్యం చాల టంలేదు.

ఒకరోజు...

సాయంకాలం కాలేజీ వదలగానే ఆమె వెనక నడకసాగించాడు. నడుస్తూనే ఆమెతో ఏం మాట్లాడాలో ఆలో చించాడు. రూంలో బైహార్ట్ చేసి, రిహార్సల్ చేసిన డైలాగ్స్ ఒక్కసారి నెమరు వేసుకున్నాడు. గట్టిగా ఊపిరి పీల్చి, గుండె మీద చెయ్యేసుకుని ఆమెను సమీపించాడు. ప్రక్కనే నడుస్తూ ఆమె వైపు తిరి 'ఏవండీ!' అన్నాడు.

కాని శబ్దం బయటికి రాలేదు. కంఠం లోనే ఆగిపోయింది. మరల ప్రయత్నపూర్వ కంగా పిలిచాడు.

ఆమె తిరిగి చూచింది.

ఎవరైనా వస్తున్నారేమోనని నాలుగు వైపులా చూశాడు. ఎవరూ రావటం లేదు. ఒక్కసారి గొంతు సవరించుకుని 'మీతో కొంచెం మాట్లాడాలి' అన్నాడు మెల్లగా తడబడుతూ.

# ప్రేమొద్దు బాబోయ్

'ఆఁ! ఏమిటి?' అందామె రోడ్డు ప్రక్కగా నిల్చొని ప్రశ్నార్థకంగా అతని వైపు చూస్తూ.

ఆమె ఫీలింగ్స్ చూస్తే ఏ మూడ్‌లో ఉందో అర్థం కాలేతనికి. ముఖంలో ఏ భావాలూ చదవలేక పోతున్నాడు. ఏమీ తోచక ఆమె శరీరం వైపు 'ఎక్స్—రే' కళ్ళతో చూస్తూ నిల్చున్నాడు.

చక్కని కోలముఖంలో యువకుల్ని ఉత్తేజింపచేసే రెండందమైన కళ్ళు. సంపెంగ పూవులాంటి నాశిక. గులాబి రంగు చెక్కిళ్ళు. ఎర్రని పెదాలు. మాట్లాడినపుడు మిలమిలా మెరిసే తెల్లని పలువరస. మెడలో సింపుల్‌గా వో డాలర్ చైన్. ఓహ్! అజంతా శిల్పాలకు తీసిపోని అందం ఆమెది. సాయింకాలపు నీరెండలో పసిడి బొమ్మలా మెరిసిపోతూంది. ఆమెనంత దగ్గరగా చూడటం అదే మొదటిసారి కావటం వలన ముగ్ధుడై, ఆశగా చూస్తున్నాడామె వైపు —పసిపిల్లవాడు మిఠాయి పొట్లం వంక చూస్తాడే, అట్లా!

'ఏమిటో త్వరగా చెప్పండి. నేవెళ్ళాలి' ఆమె ముఖంలో చిరుకోపం కన్పిస్తూంది.

మైమరచి అలాగే చూస్తున్నవాడల్లా ఉలిక్కిపడ్డాడు. ఏదో చెప్పాలనుకున్నాడు. ఒక్కమాటలో చెప్పాలనుకున్నాడు కానీ ఏమీ చెప్పలేకపోతున్నాడు. రూంలోచేసిన రిహార్సలంతా వేస్టయింది. ఒక్క డైలాగూ జ్ఞాపకం రావటం లేదు. అతనికి ముచ్చెమటలు పోశాయి. క్రొత్తగా ఉద్యోగంలో చేరి మొదటిసారిగా క్లాసులో అడుగు పెట్టిన లెక్చరర్‌లా ఉందతని పరిస్థితి.

'ఏమిటలా తెల్లబోయి చూస్తున్నారు' అందామె పక పకా నవ్వుతూ. నవ్వుతూంటే ఆమె చెవుల రింగులు తమాషాగా కదులుతున్నాయ్!

జోగారావు బుర్ర గోక్కుంటూ ఆమె వైపు చూచి పళ్ళికిలించాడు, పేక ముక్కలోని జోకర్ బొమ్మలా.

'అయితే ఆలోచించుకోండి. తర్వాత చెబుదురుగాని' ఆమె వెళ్ళిపోతూంది.

'అది కాదండీ' అన్నాడు మెల్లగా. కాని ఆమె అప్పటికే ఆ మాట విన్పించనంత దూరం వెళ్ళిపోయింది.

వచ్చిన అవకాశాన్ని వదలుకున్నందుకు తన్ను తనే తిట్టుకున్నాడు. ఛ! వెధవనోరు ఒక్క మాటయినా పెగల్లేదు. అయినా గుండెలంత వేగంగా కొట్టుకున్నాయెందుకు? ఔను మరి. ఆ పరిస్థితి అలాంటిది. మౌనంగా సరిపెట్టుకున్నాడు. ఏది ఏమయినా ఆమె నవ్వుతూ మాట్లాడినందుకు సంతోషించాడు. ముందు ముందు తన విజయానికి ఆనవ్వు నాందీగా ఊహించుకుని మురిసిపోయాడు. వెంటనే రూంకెళ్ళి 'పిట్ట వలకు దగ్గరగా వచ్చిందనీ, తప్పక పడుతుందని' బల్లగుద్ది చెప్పేశాడు రూంమేట్సుకు.

ఆరాత్రి అతనికో అందమైన టెక్నికలర్ కల వచ్చింది. శ్యామల హీరోయిన్ అయినట్లు, అతడు హీరో అయినట్లు రెండు డ్యూయెట్లు కూడా పాడేశాడు కలలో. మొత్తం మీద ఆరాత్రి హాయిగా నిద్రపోయాడు—

...రెండునెలలు గడిచాయి...

ఈరెండు నెలలూ మనవాడి దినచర్య మామూలే. ఏం మారలేదు. పరీక్షలు దగ్గరకొస్తున్నా లెక్కచెయ్యక ఊహల్ని ఆమెచుట్టూ త్రిప్పుతూ గడిపేస్తున్నాడు. ఆశతో జీవిస్తున్నాడు.

ఆరోజు ఆదివారం—

సాయంకాలం సరదాగా రోడ్డమ్మట నడుస్తున్నవాడల్లా ప్రక్కనున్న పార్కులోని కప్పడేవెళ్ళిన వో అమ్మాయిని చూచి చటుక్కున ఆగాడు. 'ఎవరుచెప్మా! శ్యామలలా ఉందే!' అనుకుంటూ పార్కువైపు నడిచాడు.

అవును నిస్సందేహంగా ఆమే! ఆమె ప్రక్కనే యింకో పదేళ్ళ కుర్రాడున్నాడు. వాళ్ళిద్దరూ పార్కు వో మూలగా వెళ్ళి, గుబురుగా ఉన్న క్రోటన్స్ మధ్య పచ్చికపై కూర్చున్నారు.

ఆమెను చూస్తూనే జోగారావుకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. ధైర్యం చేసి దగ్గరకెళ్ళి 'హలో! మీరిక్కడున్నారా? కులాసానా?' అన్నాడు పాత పరిచయస్తుడు మల్లె.

ఆమె మౌనంగా ఒక్కసారి అతనివైపు చూచి, ప్రక్కనున్న కుర్రాడితో ఏదో చెబుతోంది.

అది చూచేప్పటికి జోగారావు బుర్రకు వో ఐడియా వెయ్యి కిలోమీటర్ల వేగంతో వచ్చి తాకింది.

శ్యామల ప్రక్కనున్న కుర్రాడి వైపు చూస్తూ 'ఇలారా బాబూ' అన్నాడు ముద్దుగా. వాడు తటపటాయిస్తూ శ్యామల వైపు చూచేసరికి 'పర్వాలేదు. రా బాబూ! మాట చెబుతాగా' అన్నాడు ఆప్యాయంగా.

ఆ అబ్బాయి బెదురుతూనే అతనికి దగ్గరగా వచ్చాడు.

వెంటనే జోగారావు రెండు చేతులతో కుర్రాడ్ని చుట్టేశాడు. నవ్వుతూ వాడి ముఖంలోకి చూచి, ఆమె చూడకుండా జేబులోంచి వో పావలా తీసి వాడి చేతిలో పెట్టి 'గేటువద్ద వేయించిన వేరుశెనగపప్పు లున్నాయి కొనుక్కోపో బాబూ!' అన్నాడు మెల్లగా వాడ్ని విడిపిస్తూ.

సంతోషంతో పరుగెడుతున్న కుర్రాడికి శ్యామల పిలవటం కూడా విన్పించలేదు.

'చాకు'లా పనిచేసిన మెదడును మెచ్చుకుంటూ, హుషారుగా కొంచెం ముందుకెళ్ళి ఆమెకు దగ్గరగా వో చిన్న పోజిచ్చి నిల్చున్నాడు.

ఉపోద్ఘాతం ఎలా ప్రారంభించాలా అని కాస్త తికమకపడి, చివరకు 'ఏమండీ! చాలరోజుల్నుండీ మీతో కొంచెం మాట్లాడాలనుకుంటున్నాను— అహఁ ... మాట్లాడటం కాదులెండి, మీతో వో విషయం చెప్పాలి. విషయమేమిటి నాతలకాయ్ — మీ మనసు తెలుసుకుని...'

ఆమె మధ్యలోనే అందుకుని 'మీరు చెప్పబోయేదేమిటో నాకు బాగా తెలుసు. ఎందుకు వృధాగా శ్రమపడతారు. వెళ్ళండి' అంది మామూలుగా.

ఆమె మూడ్ చూస్తే అతనికెక్కడలేని ఉత్సాహం వచ్చింది.

'అయితే, మీకంతా తెలుసన్నమాట. యిహఁ వినండి. నాపేరు ఎ. జె. రావు. అంటె అవనిగడ్డ జోగారావు. అమ్మా నాన్నా ముద్దుగా 'జగ్గూ' అంటారు. చనువున్న స్నేహితులు మాత్రం 'జోగీ' అంటారు. చదువుతున్నది ఫైనలియర్. స్వగ్రామం నెల్లూరు. చాలరోజుల్నుంచి మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మామూలుగా కాదు. గాఢంగా! నా ప్రేమ కాన్సెంట్రేటెడ్ యాసిడ్ లాంటిది. కాగితాలు, గోడలు ఖరాబు చేసే పద్యాలుగు క్యారెక్టర్ల ప్రేమకాదు నాది. అసలు సిసలైనదన్నమాట బంగారంలాంటిది. అందుకే మీతో ముఖాముఖీ చెబుతున్నాను.'

కంఠతా పెట్టిన వాడల్లే ఒక్కో వాక్యాన్ని నిదానంగా చెప్పేస్తున్నాను.

'ఎక్స్‌క్యూజ్ మీ రావుగారూ! మీరొక్కరు ప్రేమిస్తే సరా? నేను ప్రేమించక్కర్లే?' కో మాదిరి వ్యంగ్యంగా అందామె.

'అయితే మీరూ ప్రేమించండి. కొంచెం నిదానంగా ప్రేమించినా ఫర్వేదులెండి' అన్నం అక్కినేని ఫోజులో చూశాడామెను.

'అబ్బబ్బ! ఏమిటీగోల! ముందు మీరిక్కడ్నుంచి వెళ్ళండి!' చిరాగ్గా అందామె—

ఆమె చిరాకు చూచి కాస్త జంకినా, ఆమె ముఖం చూస్తే హుషారొచ్చిందతనికి—

'శ్యామా! నువ్వే అలాగంటే ఎలాచెప్పు? నువ్వులేకుండా నేను...' డైలాగ్ మధ్యలోనే 'కట్' అయింది—

'యూ ఫూల్, షటప్! ఏమిటా చనువు? మర్యాద తెలీదూ? ముందిక్కడ్నుంచి వెళ్తావా లేక నలుగుర్నీ...' ఖస్సుమంటూ లేచి నిల్చుందామె. నాగులా బుసకొడుతూంది.

ఆమె కళ్ళల్లో మెరుపు చూడలేక తల వంచుకున్నాడతను. షడన్ దెబ్బకి అదిరి పోయాడు. 'అవును ఆడవాళ్ళెప్పుడూ మొదట్లో యింతే. ముందు 'హీరో'ని 'హీరోయిన్' నానా అగచాట్లూ పెట్టి, దండాలంగా తిట్టిపోసి, ఆఖరికి హీరో కౌగిట్లో కరిగిపోవటం తనెన్ని సినిమాలలో చూళ్ళేదూ?' ఈ ఆలోచన రాగానే ఓ నిశ్చయానికొచ్చాడు.

# ప్రేమెద్దు బాబోయ్

'సారీ. శ్యామలాదేవిగారూ! త్వరపడ్డాను.' అన్నాడు కంఠాన్ని వీలైనంత తియ్యగా మారుస్తూ.

'సారీ' అట 'సారీ'—పీడ గోరీ!' మనసులోనే గొణుక్కుందామె. అటూ ఇటూ చూస్తూ కుర్రాడ్ని వెతుకుతూంది.

'మీరు సరేనంటే మ్యారేజి చేసుకుందాం' ఆశ చంపుకో లేక ఆఖరిసారిగా అన్నాడు.

'అలాగా?' అందామె వ్యంగ్యంగా అతని వైపోసారి చూచి చిన్నగా నవ్వి.

ఆ నవ్వుతో మనవాడు పూర్తిగా 'ఐస్' పోయాడు. ఆమె మూడ్ క్షణ క్షణానికి మారుతున్నందుకు ఆశ్చర్య పోయాడు.

'నిజం శ్యామా! ఇప్పుడే రిజిష్టరు మ్యారేజి చేసుకుందాం పద!' ఆమె వైపొక 'రొమాంటిక్ స్మైల్' విసిరి హుందాగా వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

'అంతకన్నానా!' అందామె మెల్లగా చెయ్యి విడిపించుకొని వెనక్కు జరుగుతూ.

మిస్టర్ ఎ. జె. రావ్ ఏగిరి గంతేశాడు. కోరిక తీరినందుకు మనసులోనే వెయ్యి దేవుళ్ళకు దణ్ణం పెట్టాడు. తన్మయత్వంలో ఓ క్షణం కళ్ళుమూసుకున్నాడు. అంతే...

స్పుట్నిక్ వేగంతో ఏదో వస్తువతని చెంపను తాకింది. బిత్తరపోయి కళ్ళు తెరిచాడు.

ఆమె చరచరా నడిచిపోతూంది.

'ఇదే నీకు నా ప్రేమ కానుక. మంచిగా చెపితే వింటావనుకున్నాను. లేకుంటే మొదట్నే ఈపని చేసేదాన్ని. ఇంకెప్పుడైనా యిలాంటి పిచ్చివేషాలు వేశావా... జాగ్రత్త! మా నాన్నతోచెప్పి నీ ఒళ్ళు...' ఉరుములా ఘర్జిస్తూంది. ఒక్కసారి ఛుఛుగ్గా వెనక్కు చూచి, అప్పుడే వచ్చిన కుర్రాడ్ని వెంటతీసుకుని, లక్ష్మణునిచే పరాభవింపబడ్డ శూర్పణఖలా విసురుగా వెళ్ళిపోతూందామె—

ఆమె వెళ్ళిపోతుంటే గుడ్లప్పగించి చూస్తూ నిల్చున్నాడు జోగారావు— ఏం చెయ్యాలో తోచక పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు —

'ఇడియట్! ప్రేమట—ప్రేమ. పనిలేని ప్రతివాడికీ ప్రేమించటం ఓ ఫ్యాషనయింది' ఆమె మాటలు విన్పించీ విన్పించనట్లుగా గాలిలో ప్రతిధ్వనిస్తున్నాయ్! ఇక వినలేక చెవులు గట్టిగా మూసుకున్నాడు. నిలువునా సల్ఫ్యూరిక్ యాసిడ్‌లో ముంచినట్లుందతని స్థితి.

రూంకెళ్ళి జరిగిందంతా చెప్పాడు గోపీకి. అంతా విని 'ఏమో బాబూ, ఆ అమ్మాయేమో నీకు దక్కేట్లులేదు. నువ్వా అమ్మాయిని మర్చిపోవటం మేలనిపిస్తూంది. అందులో వాళ్ళ నాన్న అట్టే మంచివాడు కాదట' అన్నాడు గోపీ నిరాశగా నిట్టూరుస్తూ.


గోపీ మాటలతో జోగారావు పెన్షియం తీగలా మండిపడ్డాడు.

'ఛీ! ఛీ! అంతా వెధవలు— అసలీ ప్రపంచంలో ఎవరినీ నమ్మకూడదు — ఫ్రెండ్స్ నసలే నమ్మకూడదు. ముందేమో 'దిగు—దిగు' అంటూ రంగంలోకి దింపుతారు. వ్యవహారం ఏమైనా బెడిసికొట్టిందా, అంతే! చచ్చుకబుర్లు చెప్తూ తలోదారిన మెల్లగా జారుకుంటారు. ఒరేయ్! గోపీ! నేను సక్సెస్ అయ్యుంటే 'ఒరేయ్ జోగీ నేను ఇచ్చిన సలహా కదట్రా?' అంటూ నువ్వా కాలరెత్తేవాడివి కదూ?'

ఆవేశంగా మాట్లాడుతున్న జోగారావు వైపు గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు గోపీ—

* * *

పరీక్షలయిపోయాయి. జోమారుగా



ప్రాశామన్న తృప్తితోనే సెలవులకు ఇంటికి వెళ్ళాడు జోగారావు.

ఒకరోజు శుభముహూర్తాన వాళ్ళ నాన్న జోగారావును దగ్గరకు పిల్చి 'ఒరేయ్ జగ్గూ! మీ అమ్మ నీకు పెళ్ళిచేయాలని తొందరపడుతోందిరా' అన్నాడు.

ఆ మాటతోకూడ జోగారావు సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు. సూటిగా తండ్రి వైపు చూడలేక మౌనంగా తలవంచుకున్నాడు.

'మొన్న ఒక సంబంధం వచ్చింది. ఆనందరావుగారని పెద్ద వకీలు. బాగా డబ్బున్నవాడు. అమ్మాయి కూడా చాల బాగుంటుంది. అన్నీ మాట్లాడుకోవటం కూడా పూర్తయింది. ఇక నీవు అమ్మాయిని చూసి సరేనంటే ముహూర్తం పెట్టేస్తాం. పెళ్ళిచూపులకు ఈరోజే బయల్దేరి వస్తున్నామని నిన్న వాళ్ళకు టెలిగ్రాం కూడా యిచ్చాను.'

'అప్పుడే నా పెళ్ళికేం తొందరొచ్చింది నాన్నా! రిజల్టు వచ్చిన తర్వాత...' ఇంకా ఏదో చెప్పబోయాడు జోగారావు.


'ఛీ! వెధవ రిజల్ట్సు — వస్తేమాత్రం మహేమన్నా పాసయి ఏడుస్తావా ఏమ నాన్నా? అందుకేరా రిజల్ట్సు రాకముందే అన్నీ ఫిక్సయిపోవాలి' గీతా రహస్యం చెపుతున్నట్లుగా చెప్పాడు వాళ్ళ నాన్నగారు —

వాలఘుంది చదువుకునేప్పుడే పెళ్ళి సంబంధాలు ఎందుకు చూస్తున్నారో పూర్తిగా అర్థమైంది జోగారావుకు. తండ్రి చెప్పిందీ ఒక పాయింట్‌గానే తోచింది. మరుక్షణం శ్యామల అతని మనస్సులో మెదిలింది. ఏదో చెప్పాలని తలెత్తి వాళ్ళనాన్న గారి వైపు చూశాడు — కాని, ఎలా చెప్పాలో అర్థం కాలేదు —

'సాయంకాలం మూడుగంటలకు ప్రయాణం. సిద్ధంగా ఉండు' జోగారావు జవాబుకు ఎదురుచూడకుండా లోపలికెళ్ళిపోయారు వాళ్ళనాన్నగారు.

'రేయ్ జగ్గూ! త్వరగా తెమిలిరా! మరలా రాహుకాలం వస్తుంది' కారులో కూర్చుంటూ కేకేశాడు వాళ్ళనాన్నగారు —

జోగారావు మెల్లగా, కొత్త పెళ్ళికూతురులా కారు దగ్గరకు వచ్చాడు. తండ్రికి ఏమేమో చెప్పాలని, ఎలాగైనా ఈ ప్రయాణం ఆపు చెయ్యాలని అతని మనస్సు ఆరాట పడుతోంది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. చివరకు ధైర్యంచేసి **'అది_కాదు నాన్నా...'** అనుగుతూ తండ్రి


అయింట్‌మెంటులు, పూతలు, మామూలు బిళ్ళలూ_ఇవన్నీ పాత తరహావి. అవి పని చెయ్యటానికి ఎంతో కాలం తీసుకుంటాయి. అంతకాలమూ మీరు బాధను అనుభవించాల్సివస్తుంది. ఏమాత్రం తలనొప్పి గాని, ఇతర నొప్పులు గాని కనిపించగానే మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' తీసుకుంటాను. అంతే! నొప్పి చిటికెలో తగ్గిపోతుంది.

నొప్పిని తగ్గించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' శాస్త్రీయమైన ఆధునిక నివారణ. 'మైక్రోఫైన్డ్' అంటే ప్రతి 'ఆస్ప్రో' బిళ్ళ 150 మిలియన్ల అతి సూక్ష్మమైన అణువులను కలిగి ఉండటం. ఈ అణువులు అతి త్వరగా కరుగుతాయి, ఇముడుతాయి. అంతే త్వరగానూ నొప్పిని తగ్గిస్తాయి. మీకు సత్వర నివారణ కలిగించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' మామూలు బిళ్ళలకంటె రెట్టింపు త్వరగా పనిచేస్తుంది.

అనవసరంగా బాధను అనుభవించకండి_మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను తీసుకోండి.

మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను-నొప్పి · తలనొప్పి · ఫ్లూ · ఒళ్లు నొప్పులు · జలుబు · కీళ్ల నొప్పులు · గొంతునొప్పి · వంటినొప్పులకి వాడండి.

మోతాదు: పెద్దవారికి:రెండు బిళ్లలు. అవసరమైతే మళ్లీ వేసుకోండి. పిల్లలకు:ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహానుసరించి వేసుకొనవలెను.




**నెమ్మదిగా నివారించును**
బిళ్లలోని పెద్ద అణువులు నెమ్మదిగా ఇముడుతాయి. నొప్పి తగ్గటానికి చాలాసేపు పడుతుంది. కనుక అంతసేపూ మీరు బాధ పడాల్సి వస్తుంది.



**శీఘ్రముగా నివారించును**
బిళ్లలోని చిన్న అణువులు త్వరగా ఇముడుతాయి. మూలమునకు త్వరగా చేరుకుంటాయి. కనుక త్వరగా నొప్పిని తగ్గిస్తాయి.



**నొప్పిని అతిశీఘ్రంగా తొలగించడానికే 'ఆస్ప్రో' మాత్రమే మైక్రోఫైన్డ్ చేయబడినది.**

నికోలస్ ప్రొడక్ట్స్

ముఖంలోకి చూశాడు. అంతే! పొట్టేలు కొమ్ముల్లా వంకర్లు తిరిగిన ఆయన గుబురు మీసాలు చూసేసరికి నోట మాట లేక మెల్లగా వెళ్ళి కార్లో కూర్చున్నాడు. కారు కదిలింది—

'ఏయ్ డ్రైవర్! అక్కడే! ఆ పెద్ద మేడ దగ్గరే ఆపు'

కళ్ళు మూసుకొని కలలు కంటున్న వాడల్లా తండ్రి మాటలతో ఉలిక్కిపడ్డాడు జోగారావు. అప్పటికే కారు ఆ మేడ ముందాగింది.

యథాలాపంగా కారు దిగి, చుట్టూ వోసారి పరికించి, ఆ మేడవైపు చూశాడు జోగారావు. అతని గుండె జల్లుమంది.

'నాన్నా...' అన్నాడు జోగారావు గుడ్లు తేలేసి, వాళ్ళ నాన్న వైపు చూస్తూ.

ఏమిటన్నట్లు చూశారాయన.

'ఇక్కడెందుకాపారు నాన్నా? ఇది... ఇది...' మాటలు తడబడ్డాయి.

'ఏమిట్రా? ఆనందరావుగారిల్లిదే!' అంటూ ఆ మేడవైపు వోసారి పరిశీలించి చూసి, 'మేడ చాల బాగుంది కదూ?' అన్నారాయన కొడుకువైపు చూస్తూ.

జోగారావుకు ఏం చెయ్యాలో తోచలేదు. 'బాగుంది నాన్నా! మేడ చాల బాగుంది. ఇక యింటికి వెళ్దాం పదండి.'

'అదేమిట్రా? ఇల్లు చూసి పెళ్లి చేసుకుంటావా ఏం? పిల్లను చూడక్కర్లా?'

'వద్దు నాన్నా! వద్దు!' తెలిని భయ

# ప్రేమెద్దు బాబోయ్

మేదో ఆవహించిం దతన్ని.

'బోర్లాపడుకుని లోపలికి పద!' కొడుకు వైపు గుడ్లురిమి చూసి, ముందుకు నడిచాడు—

జోగారావుకు తండ్రిని అనుసరించక తప్పలేదు—

అనుకోకుండా జరిగిన సంఘటనకు అదిరిపోయాడు జోగారావు. వైద్యుడు చెప్పిందీ, రోగి కోరిందీ ఒకటైనందుకు తన మనసు సంతోషంతో ఉరకలు వేసింది. కాని, ఏదో అర్థం కాని భయం. తెలిసీతెలని అనుమానాలు—

ఆ అమ్మాయి ఇప్పుడు తన్ను చూస్తే, ఏమనుకుంటుందో! తనను అసహ్యించుకుంటుందేమో! ఈ పెళ్ళికి ఒప్పుకోదేమో! అతని మెదడు ఆ తర్వాత ఆలోచించలేకపోయింది.

'ట్రే'లో కాఫీ తెచ్చి టీపాయ్ మీద ఉంచి వయ్యారంగా నిల్చున్న శ్యామలవైపు కన్నార్పకుండా చూశాడు జోగారావు. ఇంతకు ముందెన్నోసార్లు ఆమెను చూశాడు. కాని అప్పుడు చూడటానికీ ఇప్పుడు చూడటానికీ చాల తేడా వుంది. ఒక సామాన్య ప్రేక్షకుడుగా, ఆశతో, అందని మావి పండులాగ చూసేవాడప్పుడు...కాని...ఇప్పుడు...? గాంభీర్యంతో, ఇంటర్వ్యూలో అభ్యర్థిని సెలెక్ట్ చేయబోతున్న ఆఫీసర్ హోదాలో చూస్తున్నాడు—

ఆమె మెల్లగ తలెత్తి క్రీగంట అతని వైపు చూసింది.

ఆ చూపుతో మనవాడి గుండె కాస్త ఆగి, మరలా కొట్టుకోటం ప్రారంభించింది.

ఆమె ముఖంలోకి చూస్తూ, మనసులోని భావాలు పసికట్టెయ్యాలని విశ్వప్రయత్నం చేశాడు. కాని, లాభం లేకపోయింది. ఆమె ముఖంలో ఏ భావాలూ చదవలేకపోయాడు. ఒక అపరిచిత వ్యక్తిని చూసినట్టే, అతన్ని చూసిందామె. ఇంతకు ముందెప్పుడూ చూడనట్లు క్రొత్తగా తన వైపు చూస్తున్న ఆ అమ్మాయిని చూసి నిజంగానే ఆశ్చర్యపోయాడు జోగారావు.

ఆ పెళ్ళి చూపుల తంతు కాస్తా అయిపోయింది.

ఆమె లోపలికెళ్ళి పోయింది. వెళ్తూ వెళ్తూ వో చిరునవ్వు వోరచూపుతో జోడించి, ఒయ్యారంలో రంగరించి, నాజూగ్గా జోగారావు ముఖాన పారేసి మరీ వెళ్ళిందామె.


దాంతో మనవాడికి వెయ్యేనుగుల బలం వచ్చింది. చటుక్కున కుర్చీలోంచి లేచి ఆమె వెనుక రెండడుగులువేసి, సమయం— సందర్భం గుర్తురావటంతో మరలావచ్చి యథాస్థానంలో కూర్చున్నాడు.

చెమటలు పట్టిన ముఖాన్ని ఒక్కసారి జేబురుమాలుతో తుడుచుకున్నాడు. తన వైపే చూస్తున్న తండ్రివైపుచూసి చిన్నగా నవ్వబోయి, ఆనందం పట్టలేక పెద్దగా నవ్వేశాడు జోగారావు.

అదృష్టం కలిసొచ్చి జోగారావు కోరిక నెరవేరింది—జాక్‌పాట్ తగిలినట్లు ఫీలయ్యాడతను. వో శుభలగ్నాన శ్యామలమెళ్లో చాలా ముళ్లువెయ్యాలనుకుని, పురోహితుడు వారించటంతో మూడు ముళ్ళమాత్రం గట్టిగా బిగించి మరీ వేశాడు.

ఆ రోజు రాత్రి.....శోభనపుగదిలో......

ఇష్టదైవంకోసం ప్రార్థిస్తూ కూర్చున్న భక్తునిలా ఆమెకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు—అనుకున్నక్షణం రానేవచ్చింది.



జోగారావు నోములన్నీ ఫలించాయి—అమె గదిలో అడుగుపెట్టింది.

నునుసిగ్గుతో కుంచించుకుపోతున్న జీవిత భాగస్వామిని సాదరంగా ఆహ్వానించి, మంచంపై కూర్చోబెట్టి, ప్రక్కనే కూర్చున్నాడు జోగారావు—


సిగ్గు బరువుతో వాలిపోతున్న ఆమె తలను మెల్లగా గడ్డం పుచ్చుకుని పైకెత్తి, ఆమె కళ్లల్లోకి చూశాడు...మొదటిరోజు రోడ్డుమీద అల్లరిచేసే కాలేజీపిల్లగా కన్పించిన చిన్నారి. పార్కులో రవుద్రాకారంతో కాళికాదేవి విశ్వరూపం చూపిన అబల. పెళ్లిచూపులలో గంభీరంగా అమాయకంగా కన్పించిన కన్నెపిల్ల, పెళ్లి మంటపంలో సిగ్గు దొంతర్లలోముడుచుకుపోయిఅసలైనపెళ్లికూతురులా రాణించిన ముగ్ధ. ప్రస్తుతం ఆమె సర్వస్వం తనకర్పించడానికి సిద్ధపడి, భర్త హృదయంలో తలదాచుకోటానికి ఆరాటపడే శ్యామల. ఆక్షణంలో స్త్రీ ప్రకృతంతా—అర్థమైనట్లనిపించింది జోగారావుకు. ఆప్యాయంగా రెండు చేతులూ ఆమె భుజం చుట్టూవేసి తన వైపు త్రిప్పుకుంటూ 'శ్యామ్' అన్నాడు మెల్లగా. వెంటనే మరలా ఆమె ముఖంలోకిచూస్తూ 'సారీ! అతి చనువుగా ప్రవర్తిస్తే మరలా నా చెంప వాచిపోతుందేమో!' అన్నాడు తమాషాగా నవ్వుతూ.

'ఛ! అదేం మాటలు' అందామె సున్నితంగా చూపుడువేలు అతని నోటికడ్డం పెడుతూ.

'ఆరోజు ఏదో ఆవేశంలో అలా చేశాను—ఆ తర్వాత చాలా బాధపడ్డాను. నా పొరపాటు క్షమించండి. అయినా, అది ప్రేమ—ఇది పెళ్లి. ఇప్పుడు మీరు నాకు...' ఆమె స్త్రీ అయిపోయింది.

'ఏమిటీ? అది ప్రేమా? ఇది పెళ్లా? అయితే వద్దు. అలాంటి ప్రేమొద్దు బాబోయ్!' మనసులోనే అనుకుంటూ ఆమెను హృదయానికి హత్తుకున్నాడు జోగారావు. కాదు—కాదు, ఘనవిజయం సాధించిన మన గ్రేట్ హీరో జోగారావు.

# కుతపకాలం —— సేకరణ



బులుసు వేంకటరమణయ్య: ధర్మపథం

అల్లసాని పెద్దనామాత్యుడు మనుచరిత్రలో—ప్రవరుని యింటికి కుతపకాలంలో ఒక సిద్ధుడు వచ్చినట్లు చెప్పియున్నాడు. దాన్నిబట్టే తెలుగువారు కుతపకాలాన్నిగురించి కొంత వినడం, కొంత చర్చించడం జరిగింది. పగలు 15—16 గడియలకాలం కుతపకాలమనీ, రమారమి 12 గం. నుంచి ఒంటిగంటలోపు కాలం (2 గడియలు—అంటే 48 నిమిషాలు) కుతప కాలమనీ గ్రహించాలి.

ఆ సమయంలో సూర్యుడు నడినెత్తికి రావడంవల్ల ఎండ మిక్కిలి తీక్షణంగా ఉంటుంది. అందరికీ ఎక్కువ తాపం కలుగుతుంది.

'కుంయత్రగోపతిర్గోభిః
కార్త్స్న్యేన తపతిక్షితీ'
సకాలః కుతపోనామ'

అవి తీక్ష్ణకిరణుడైన సూర్యుడు పూర్తిగా తన కిరణములచేత భూమిని తపింపజేసే కాలం కుతపకాలమని చెప్పబడింది.

మరో విశేషం ఏమంటే—

దినానికిఉన్న 60 గడియల్లో ముప్పయి గడియలకాలం పగలూ, ముప్పయి గడియల కాలం రాత్రిన్నీ. పగటికాలాన్ని పదిహేను భాగాలుగా విభజిస్తే ఒక్కొక్క భాగానికి రెండేసి గడియలు వస్తాయి. ఆ పదిహేను భాగాలకూ వేర్వేరు పేర్లున్నవి.

'రౌద్రః శ్వేతశ్చ మైత్రశ్చ
తథా శారభటః స్మృతః,
సావిత్రో విజయశ్చైవ
గాంధర్వః కుతపస్తథా
రౌహిణేయో విరించశ్చ
సోమో౽థ నిర్ఋతిస్తథా
మాహేంద్రో వరుణశ్చైవ
భటః పంచదశ స్మృతాః

పగటికాల భాగాలు రౌద్ర, శ్వేత, మైత్ర శారభట, సావిత్ర, విజయ, గాంధర్వ, కుతప రౌహిణేయ,విరించ,సోమ,నిర్ఋతి,మాహేంద్ర, వరుణ, భట నామములు కలవి. ఇవి ఉదయం నుండీ రెండేసి గడియలకు వరుసగా వున్న పేర్లు. ఎనిమిదోది కుతప కాలం. 15, 16 సంఖ్య గడియాల కాలం. ఆ సమయంలో సూర్యుడు భూమిని తీవ్రంగా తపింపజేయడంవల్లనే దానికి కుతపకాలమనే పేరు వచ్చిందట!

కుతపకాలంలో ఇంటికి వచ్చిన వారికి ఆతిథ్యం ఇచ్చితీరాలి. సన్యాసులు, సిద్ధులు, యోగులు, పాంథులు మున్నగువారు కేవలం తిండికోసం ఒకరియింటికి పోరు. ప్రాతః కాలంనుంచీ ప్రయాణం సాగిస్తూ, కుతప కాలానికి చేరిన ఊళ్లో ఒక గృహస్థు ఇంటికి వెళ్లేవారు. వారేమి పెట్టినా తృప్తిపడి, కొంత విశ్రాంతి తీసుకుని తర్వాత మళ్ళీ ప్రయాణం సాగించేవారు.

అట్టిసమయంలో వచ్చిన వారిని గృహస్థు ఆదరించక తప్పదు. ఏమంటే—ఆ సమయంలో మరొకవూరు వెళ్లడం సాధ్యం కాదు. ఈ విషయం గృహస్థులకు తెలియనిదికాదు.

సహజంగానే ఉత్తముడైన ప్రవరుడు అట్టి కుతపకాలంలో తన యింటికి వచ్చిన సిద్ధుణ్ణి ఎంతో గౌరవించి, ఆతిథ్యం ఇచ్చాడు! మనుచరిత్ర చదివిన వారికి ఇది బాగా తెలుస్తుంది.